ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ విజయేందిరబోయి

నవాబ్‌పేట, నవంబర్ 7: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. మండలంలోని ఇప్పటూర్, కారూర్‌లో చేపడుతున్న సర్వే పనులను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టిక్కరింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ వివరాలను పూర్తిగా తెలుసుకొని స్టిక్కర్‌పై రాసిన తర్వాతనే ఇంటికి అతికించాలని సూచించారు. వార్డు, బ్లాక్ కోడ్ నెంబర్లను సరి చూసుకున్న తర్వాతనే 9వ తేదీ నుంచి ఇండ్లను సందర్శించి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, తాసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పెద్దచింతకుంటలో సర్వేను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ గరిమనరుల

ఇప్పటూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మరికల్‌లో ట్రైనీ కలెక్టర్ పరిశీలన

మరికల్, నవంబర్ 7 : ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేప ట్టాలని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల అన్నారు. గురువారం మండలంలోని పెద్దచింతకుంట, వెంక టాపూర్ గ్రామాల్లో సర్వేను ఆమె పరి శీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని తప్పులు లేకుండా పొందుపర్చాలని తెలిపారు. ప్రస్తుతం ఇండ్ల గుర్తింపు నిర్వహిస్తున్నామని, ఈ నెల 9వ తేదీ నుంచి కుటుంబ సర్వే ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండన్న, ఎంపీవో పావని తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాబాద్‌లో అదనపు కలెక్టర్

మహ్మదాబాద్, నవంబర్ 7: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో కుటుంబ సమగ్ర సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. కుటుంబంలో అందరు ఒకే దగ్గర ఉంటే రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఒకే కుటుంబంగా గుర్తించాలని సూచించారు. కుటుంబ సభ్యులు లేకుంటే బంధువుల ద్వారా వివరాలు సేకరించి నమోదు చేయించాలన్నారు. అనంతరం గండీడ్‌కు చేరుకుని సర్వే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దారు తిరుపతయ్య, ఎంపీడీవో దేవన్న, ఎంపీవో నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇండ్ల గుర్తింపు తప్పనిసరి

భూత్పూర్, నవంబర్ 7: ఇంటింటి సర్వేలో భాగంగా మండలంలోని అన్ని ఇండ్లకు స్టిక్కర్ వేసి గుర్తిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ తెలిపారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని బృందాలతో ముమ్మరంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 70శాతం స్టిక్కరింగ్ అయినట్లు తెలిపారు. 9వ తేదీ నుంచి సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరాచారి, తాసీల్దార్ రహెమాన్, ఎంపీవో శ్రీదేవి, ఏవో మురళీధర్, పీఆర్ ఏఈ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటింటికీ స్టిక్కర్లు అంటించాలి

దేవరకద్ర, నవంబర్ 7: కుటుంబ సర్వేలో భాగంగా ప్రత్యేకంగా నియమించిన ఎన్యుమ రేటర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ తిరిగి వివరాలు అడిగి స్టిక్కర్లు తప్పకుండా అంటించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం రెండో రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్యుమరేటర్లు రేపటి వరకు వివరాలు సేకరించారు.

మైనారిటీ గురుకులాల అభివృద్ధికి కృషి

● రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ

కలెక్టర్‌తో సమీక్షిస్తున్న మైనార్టీ కమీషన్ చైర్మన్ తారిక్ అన్సారీ

నారాయణపేట, నవంబర్ 7 : మైనార్టీ గురుకులాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ అన్నారు. గురువారం నారాయణపేటకు వచ్చిన ఆయన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తాప ట్నాయక్, డీఎస్పీ లింగయ్యతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమంపై సమీక్షించారు. అనంతరం మైనార్టీ గురుకుల కళా శాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబో ధన, హాస్టల్ సదుపాయం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ తదతరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

● మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
● కొల్లంపల్లి దర్గాలో సర్వధర్మ సమ్మేళనం

నారాయణపేట రూరల్, నవంబర్ 7 : భాషలు వేరైనా దేవుడు ఒక్కడేనని, అన్ని మతాల సారం ఒక్కటేనని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొల్లంపల్లి హజ్రత్ సయ్యద్ షా ఖతాల్ ఉస్సేని అష్రఫీ జలాలీ దర్గాలో ఉర్సు ఉత్సవాలు దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ ఉస్సెన్ జలాలీ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి కలీముల్లా ఉస్సేని అధ్యక్షతన సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ 24ఏండ్లుగా సర్వధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి వివిధ మతాల పీఠాధిపతులు, మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ గందె అనసూయ, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఆరీఫ్, అడ్వకేట్ సలీమ్, వివిధ దర్గాల పీఠాధిపతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, నవంబర్ 7: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బుద్దారం, వేపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సర్వే చేయాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ బెక్కరి అనిత, పెద్ద విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, తాసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీవో యశోదరమ్మ, ఏపీఎం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 7: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మొత్తం 52 మందికి రూ.16.33లక్షలు విలువ చేసే చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బర్రెల చోరీపై కేసు నమోదు

మూసాపేట, నవంబర్ 7: బర్రెలు చోరీ చేసిన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన ముష్టి చెన్నప్ప పొలం వద్ద షెడ్డులో బర్రెలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసే సరికి బర్రెలు కనిపించలేదని, ఎటు చూసినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బర్రెల విలువ రూ.1.80 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపారు. అయితే మద్దూరు సంతలో విక్రయిస్తుండగా పట్టుకొని బాధితులకు అప్పగించారు.

Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మాచారం బ్రాంచ్, మహబూబ్‌నగర్ రీజియన్
బంగారు ఆభరణముల వేలము ప్రకటన
ఈ క్రింద చూపబడిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాఖలోని ఖాతాదారులు, తమ బంగారు వస్తువుల నోటీసును వ్యవసాయేతర అవసరాలకై పొందిన అప్పులు తిరిగి చెల్లించమని అనేక డిమాండ్ నోటీసులు ఇచ్చినను అప్పులు తిరిగి చెల్లించని కారణముగా బ్యాంక్ నిబంధనల ప్రకారం తేది : 22-11-2024 సాయంత్రం 04.00 గం॥లకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈ క్రింద శాఖలో బహిరంగ వేలము వేయబడును.
ఈ క్రింద సూచించిన వివరములు తేది: 07-11-2024 నాటి వరకు అందుబాటులో ఉన్నవి. తేది: 08-11-2024 తరువాత బోటుచేసుకొనే మార్పులను వేలము రోజు పరిగణనలోకి తీసుకోబడదు.
బంగారు ఆభరణముల వేలం వేయు వివరములు
మాచారం బ్రాంచ్, మహబూబ్‌నగర్ జిల్లా

క్ర.సం.	రుణగ్రస్తుల పేరు	ఖాతా సం.	మొత్తం బరువు (గ్రా.లలో)
1	శివొల్ల విశ్వేష్ గౌడ్	260616630000196	19.55

షరతులు : 1) ఖాతాదారులలో ఎవరైనా బ్యాంకు వారి నోటీసులు ఏ కారణము చేతనైనా అందని యెడల నోటీసు తిరిగి వచ్చిన యెడల వారికి కూడా ఈ ప్రకటనపూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 2) ఖాతాదారులు ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 3) తాకట్టుదారులు ఇదే రీవన నోటీసుగా భావింపి, బకాయి చెల్లించగలరు. తదుపరి ఆక్షేపణలు అంగీకరించబడవు. 4) వేలంనందు పాల్గొనదలచినవారు PAN కార్డుతో EMD క్రింద రూ.10,000/- తేది: 22-11-2024 ఉ॥ 10:00 గం.ల నుండి 04:00 గం॥ లోపు పైన తెల్పిన శాఖలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు. 5) పెచ్చు పాటుదారులు మొత్తం పాట కొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 6) ఎటువంటి కారణము లేకుండా వేలం రద్దుగాని, వాయిదా వేయుటకు బ్యాంకు శాఖ వారికి అధికారము కలదు. 7) వివరాలకు శాఖాధిపతిని బ్యాంకు పనివేళలలో సంప్రదించండి.
తేది : 08-11-2024 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 7: రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ప్రభుత్వం సమీకృత అభివృద్ధి పథకం ద్వారా మంజూరైన ఉచిత చేపపిల్లలను మక్తల్ మండలంలోని సంగంబండ పెద్దవాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్‌లో గురువారం ఆయా ప్రాజెక్టుల సహకార సంఘం సభ్యులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 8లక్షల చేపపిల్లలు మంజూరు కాగా.. ప్రస్తుతం లక్ష41,500 చేప పిల్లలను వదిలినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏడీ రెహమాన్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత కుమార్, సంగెంబండ రిజర్వాయర్ గంగపుత్ర సహకార సంఘం అధ్యక్షుడు తిప్పన్న, భూత్పూర్ సహకార సంఘం అధ్యక్షుడు ఆనంద్ శేఖర్, ముదిరాజ్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సిం హులు పాల్గొన్నారు.

సంగంబండలో చేపలను వదులుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

కులగణన హర్షనీయం

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణనకు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో చేపట్టే కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో కోర్టు మంజూరు కావడంతోపాటు నూతన భవనం, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీహరిని లాయర్లు గురువారం మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్ గౌడ్, ఆనంద్‌గౌడ్, రవి, తాయప్ప, రవికుమార్, అశోక్ గౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), నవంబర్ 7: కౌకుంట్ల మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సాకలి రాములు తల్లి బాలమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

ధన్వాడ, నవంబర్ 7 : ధన్వాడ సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వరి కొను గోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొను గోలు కేంద్రం వద్ద రైతులెవరూ లేకపోవడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు అధికారులు స్పందించి వరి కల్లాల వద్దకు వెళ్లి కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది ప్రైవేటు వ్యాపారులకు విక్ర యిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ విషయమై వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ సింధూజ, సింగిల్ విండో సీఈవో వెంకట్రాములు, ఆర్ఐ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపుల్లో అగ్నిప్రమాదం

దేవరకద్ర, నవంబర్ 7: మండల కేంద్రంలోని రెండు దుకాణాల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. పాత బస్టాండ్ శాఖ గ్రంథాలయం సమీపంలో అలీం ఇనుప సామగ్రి దుకాణం, సుప్రీమ్ ఎలక్ట్రికల్ దుకాణంలో గురువారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసు కోవడంతో సామగ్రి మొత్తం దగ్ధమైంది. సుప్రీం ఎలక్ట్రికల్ దుకాణంలో టీవీలకు మంటలు చెలరేగడంతో ఫ్యాన్‌లు, కూలర్లు కాలి బూడి య్యాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. రెండు షాపులు కలిసి దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు దుకాణా యజమానులు మజరోద్దిన్, అలీం తెలిపారు.

ఆటోలు ఢీ: కూలీలకు గాయాలు

భూత్పూర్, నవంబర్ 7: మండలంలోని వెల్కిచర్ల శివారు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 12 మందికి పైగా కూలీలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరుకు చెందిన 12 మంది కూలీలు పత్తి తీయడానికి భూత్పూర్‌కు చెందిన రాములు ఆటోలో చేగుంటకు వెళ్లారు. కూలీ పనులు ముగించుకొని తిరిగి ఆటోలో వస్తుండగా మార్గ మధ్యంలో వెల్కిచర్ల రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కు తగిలించాడు. అదేవేగంతో వెళ్లి బిజినపల్లి మండలంలోని లట్టుపల్లితండాకు చెందిన ఓ కుటుంబం ఆటోలో వెళ్తుండగా ఆ ఆటోను ఢీ కొట్టాడు. దీంతో ప్రమాదంలో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ముగ్గురికి కాళ్లు, చేతులు విరిగినట్లు తెలిపారు. 108లో జిల్లా దవాఖానకు తరలించారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

దేవరకద్ర, నవంబర్ 7: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన కరు మూర్తి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాధారణ సెలవు సందర్భంగా మూడు రోజులు మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో ఎలాంటి క్రయ విక్రయాలు ఉండవని, రైతులు, ఖరీదుదారులు, కమీషన్ ఏజెంట్లు, దడావా యిలు, గుమస్తాలు గ్రహించాలని తెలిపారు. తిరిగి మార్కెట్ యార్డు సోమవారం రైతులు ధాన్యం విక్రయించేందుకు తీసుకురావాలని కోరారు.

నాసిరకం సరుకులు సరఫరా చేయొద్దు

● పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 7: వర్సిటీలోని వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లోపిస్తే టెండర్లు రద్దు చేస్తామని పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం వర్సిటీలోని మహిళా వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.10కోట్లతో నూతనంగా నిర్మించిన వసతి గృహంలో నెంబర్లు కేటాయించి సీనియర్ విద్యార్థినులకు వెంటనే గదులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు వసతి గృహంలో వంట గదులు, శుద్ధ జలం, భోజన నాణ్యత, సరుకులు, పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందిస్తూ మెనూ పాటించాలని సూచించారు. కార్యక్రమాల్లో పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, వార్డెన్లు మాధురి, కల్పన, కేర్‌టేకర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట టౌన్, నవంబర్ 7 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అన్నారు. గురువారం పట్టణంలోని మినీ స్టేడియంలో నారాయణపేట మండల స్థాయి అండర్-14 బాలబాలికలకు స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ప్రారంభించి మాట్లాడారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి జాజా పుల్ జెడ్పీ హెచ్‌ఎస్, ద్వితీయ బహుమతి కోట కొండ జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులు అందుకున్నారు. బాలికల విభాగంలో ప్రథమ బహుమతి కొల్లంపల్లి జెడ్పీ హెచ్‌ఎస్, ద్వితీయ బహుమతి కోటకొండ జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, పీఈటీలు అక్తర్‌పాషా, శ్రీధర్, రవికుమార్, పర్వీన్ బేగం పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నర్సింహులు

సమయపాలన పాటించని కండక్టర్

మహబూబ్‌నగర్, నవంబర్ 7: ఉదయం ఏడు గంటలకు పోవాల్సిన కర్నూల్ ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు కండక్టర్ ఆలసత్వంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కథనం ప్రకారం.. రోజూ ఉదయం కర్నూల్ బస్సు, డ్రైవర్ సమయానికి బస్టాండ్‌లో ఉన్నా.. కండక్టర్ అందుబాటులో లేకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. గురువారం డ్యూటీలో ఉన్న కండక్టర్ మాత్రం నిరంతరం ఆలస్యంగా విధులకు హాజరవుతుండడంతో 7గంటలకు పోవాల్సిన బస్సు 7:25గంటలకు బయలు దేరింది. దీంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేక పోతున్నామని ఆరోపించారు. ఈ విషయమై ఆర్ఎం శ్రీదేవి వివరణ కోరగా.. కండక్టర్ సిస్టం సమస్య ఉన్నట్లు తెలిపాడని, ఇంకోసారి సమస్య రాకుండా టైంకు బయలుదేరేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలి

ధన్వాడ/నవాబుపేట, నవంబర్ 7 : ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకే తీసుకొచ్చి తూకాలు వేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి దేవదాస్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి దినకర్, సింగిల్ విండో సీఈవో వెంకట్రాములు, ఏఈవో జ్ఞానసింగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నవాబ్‌పేట మండలంలోని ఇప్పటూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ నర్సిం హులు గురువారం ప్రారంభించారు. జీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

గ్రామాల్లో కేంద్రం బృందం పర్యటన

నవాబ్‌పేట, నవంబర్ 7: మండలంలోని తీగల్‌పల్లి, కేశవరావుపల్లి, తిమ్మయ్యపల్లిలో గురువారం కేంద్ర అధికారుల పరిశీలన బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పనులను పరిశీలించింది. మొదట తీగల్‌పల్లికి చేరుకున్న కేంద్ర బృందం సభ్యులు వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ పరిశీలించారు. ఉపాధిహామీ పనుల వివరాలు కూలీలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘం సభ్యులతో మాట్లాడి సంఘాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం కేశవరావుపల్లి, తిమ్మయ్యపల్లిలో పర్యటించారు. జీపీ ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి పనిదినాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర అధికార బృందం సభ్యులు డాక్టర్ ముత్తుకుమార్, డాక్టర్ దేవన్, డీఆర్డీవో నర్సిం హులు, అదనపు డీఆర్డీవో ముసా యిబా బేగం, ఏపీడీ శ్రీపాద్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన ప్రారంభం

బ్రిడ్జి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

ముసాపేట(అడ్డాకుల), నవంబర్ 7: అడ్డాకుల మండలం వర్నె నుంచి జాతీయ రహదారి వరకు 18 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు, వర్నె శివారులోని ఊకచెట్టు వాగుపై వంతెన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోయినప్పటికీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు రవాణా సౌకర్యార్థం వంతెనను త్వరగా ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాతర అనంతరం తిరిగి మిగిలిన పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పొలాన్ని పాడు చేశారు..

● కంకర, మట్టి వేసి సాగుకు పనికిరాకుండా మార్చారు
● రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్న రైతు

పొలంలో వేసిన డాంబరు, కంకర, మట్టి దిబ్బలు

గండీడ్, నవంబర్ 7 : మహబూబ్‌నగర్-చించోలి హైవే పనులు ఓ రైతుకు శాపంగా మారాయి. సంబంధిత భూ యజమాని అనుమతి లేకుండా పొలంలో కంకర, మట్టి, డాంబరు వేసి సాగుకు పనికి రాకుండా చేశారు. బాధిత రైతు కథనం మేరకు.. గండీడ్ మండలం కొంరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి పొలం ప్రధాన రహదారి పక్కనే ఉన్నది. అయితే ప్రస్తుతం హైవే-167 పనులు జరుగుతున్న నేపథ్యంలో కాంట్రాక్టర్ అనుమతి లేకుండా పొలంలో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ డంప్ చేశాడు. కంకర, మట్టిని పొలంలో గుట్టలుగా పోయడంతో పంట పండించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఈ విషయం తెలుసుకొన్న రైతు ఆరు నెలల కిందట కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. తీసేస్తామని చెప్పాడు. మీకు తెలియకుండానే వేశారా..? నాకు తెలియదంటూ నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు రైతు తెలిపాడు. తర్వాత